## క్లుప్తంగా

### విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం



**తాడేపల్లిరూరల్ :** తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు విద్యార్థులు తృటిలో ప్రాణాపాయం నుంచి బయట పడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం గురువారం తెల్లవారుజామున ఎన్టీఆర్ కరకట్ట మీద అతివేగంగా వస్తున్న ఓ కారు భరతమాత సెంటర్ వద్దకు వచ్చే సరికి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓ చెట్టును ఢీకొట్టింది. ఓ ప్రైవేటు యూనివర్సిటీకి చెందిన నలుగురు విద్యార్థులు కారులో ఉన్నట్లు గుర్తించారు. కారు చెట్టుకు గుద్దిన వెంటనే ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో విద్యార్థులకు గాయాలు కాలేదు. మద్యం మత్తులో ఉన్న యువకులు కారును అక్కడే వదిలేసి మరో వాహనంలో వెళ్లిపోయారు. వారు వెళ్లిన రెండు గంటల్లోపు టోయింగ్ వాహనం తీసుకు వచ్చి గప్‌చుప్‌గా వాహనాన్ని తీసుకువెళ్లినట్లు సమాచారం. చెట్టు పక్కనే హై ఓల్టేజ్ స్తంభం ఉంది. కారు ఆ కరెంటు స్తంభాన్ని ఢీకొట్టినట్లయితే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### ఏపీపీఆర్ మినిస్టీరియల్ దుగ్గిరాల యూనిట్ ఎన్నిక



**దుగ్గిరాల:** దుగ్గిరాల మండల పరిషత్ సమావేశంలో గురువారం ఏపీపీఆర్ మినిస్టీరియల్ అసోసియేషన్ దుగ్గిరాల యూనిట్ ఎన్నిక జరిగింది. జరిగిన ఈ ఎన్నికలో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని, సభ్యుల కాల పరిమితి 3 సంవత్సరాలు ఉంటుందని, పరిపాలనా అధికారి వి.చంద్రమోహన్ ప్రకటనలో తెలిపారు. ప్రెసిడెంట్‌గా వి.చంద్రమోహన్, వైస్ ప్రెసిడెంట్‌గా పి.సాంబశివరావులను ఎన్నుకోవడం జరిగిందని అన్నారు.

### భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలి


**మంగళగిరి టౌన్:** భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ)రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించాలని, పెండింగ్‌లో ఉన్న క్లయిమ్స్‌కు నిధులు విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేటి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బోర్డును ప్రారంభిస్తామని, అంతేకాకుండా తన వాటాగా రూ.కోటి బోర్డుకు జమ చేస్తానని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు అయినప్పటికీ బోర్డును పునరుద్ధరించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం బోర్డును తిరిగి ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు.

### ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి



**దుగ్గిరాల:** గత రెండు సంవత్సరాలుగా పేరుకుపోయిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని దుగ్గిరాల మండల యూనిట్ అధ్యక్షుడు అందె బాల చంద్రమౌళి అన్నారు. గురువారం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో జరిగిన సమావేశంలో ఏపీజీఈఏ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం) దుగ్గిరాల మండల అధ్యక్షుడు అందె బాల చంద్రమౌళి మాట్లాడుతూ... ఉద్యోగుల బకాయి చెల్లింపుకై నూతన విధానాన్ని అవలంబించాలని, ఉన్న బకాయిలు చెల్లించుటకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని కోరారు. కార్యక్రమంలో జి.పూర్ణ ప్రసాద్, షేక్ మీరావలి, శ్రీనివాసరావు, బసవయ్య, సయ్యద్ చాంద్ బాషా పాల్గొన్నారు.

### ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరణ



**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా కాకుమాను జోజప్ప గురువారం బాధ్యతలు స్వీకరించారు. వీరికి ముందు ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన జి.సుబ్బారావు గత నెల 31వ తేదీన పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో జోజప్ప పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జోజప్ప మాట్లాడుతూ పాఠశాల పురోభివృద్ధికి ఉపాధ్యాయుల సహకారంతో మంచి ఫలితాలు రావడానికి కృషి చేస్తానని అన్నారు. జోజప్పను ఉపాధ్యాయులు, ఎస్టీయూ ప్రతినిధులు అభినందించారు.

# కూటమి ఇచ్చిన హామీలు అమలు చేయలేదు



బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

- వైఎస్సార్‌సీపీతోనే అందరికీ మేలు
- కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి
- మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

**తాడేపల్లి రూరల్:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవితాలను మారుస్తానంటూ ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేట్ సంస్థలకు తప్ప పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా అమలు చేస్తున్నామంటూ మొక్కుబడిగా ప్రజలను ఆదుకుంటూ ప్రచారాన్ని ఊదరగొడుతున్నారని వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాకలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు అమరా నాగేశ్వరరావు అధ్యక్షతన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు వివరించి పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీవీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ వర్గానికి చెందిన ప్రజలు ఆనందంగా లేరని కూటమి ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా పేద ప్రజలను మోసం చేసిందన్నారు. అన్నదాత సుఖీభవలో కోతలు విధించారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు ఇటు ఆర్థిక సాయం అందక అటు గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. పెనుమాకలో పూర్వ వైభవం తీసుకురావాలంటే పార్టీ శ్రేణులందరూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, జగన్ ప్రభుత్వంలో రైతులు, మహిళలు, విద్యార్థులకు జరిగిన మంచిని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, మైనార్టీ రాష్ట్ర నాయకుడు ఎండీ గోరేబాబు, మండల మహిళా అధ్యక్షురాలు నాగ స్రవంతి, ప్రముఖ న్యాయవాది బాజీ గంగాధర్, నియోజకవర్గ నాయకులు కళ్ళం పిచ్చిరెడ్డి, మేకా దామేశ్వర్ రెడ్డి, పచ్చల విజయకుమార్, బ్రహ్మారెడ్డి, పుల్లారావు, మేక వెంకట శివరామిరెడ్డి, శివనాగేశ్వర రావు, కరీముల్లా, పోలా సాంబిరెడ్డి, ఎం.శివారెడ్డి, ఎం.అంజిరెడ్డి,పి.భుజంగరావు, కె.శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మంగళగిరి టౌన్:** కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని 19వ వార్డు కొప్పురావు కాలనీలో గురువారం బాబూ ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్ అధ్యక్షత వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీవీఆర్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కన్నా మెరుగైన సంక్షేమం అందిస్తామని అబద్ధపు హామీలు ఇచ్చి అందలమెక్కిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసి ఇష్టం వచ్చినట్లు పాలన చేస్తున్నారని విమర్శించారు. కక్షపూరిత రాజకీయాలు చేసి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెడుతూ కేసులు బనాయించి ఆనందం పొందుతున్నారని అన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో కూడా భారీగా కోతలు విధించడం దారుణమన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు ఎన్నో హామీలు గుప్పించారని, అధికారం చేపట్టిన తరువాత మాత్రం అవి నీటి మీద రాతలుగా మారాయని విమర్శించారు. అనంతరం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గౌరవ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ ఉపాధ్యక్షుడు షేక్ మాబూ, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, జిల్లా చేనేత విభాగ అధ్యక్షుడు ఊట్లపాల శ్రీనివాసరావు, పట్టణ ఎస్సీ విభాగ అధ్యక్షుడు మాతంగి బాబు, మంగళగిరి నియోజకవర్గ, పట్టణ యువజన విభాగ అధ్యక్షులు సయ్యద్ గౌస్, గోపి యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెనుమాక గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై తాడేపల్లి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ స్వామి శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం పెనుమాకకు చెందిన ప్రత్యూష తన ద్విచక్ర వాహనంపై మంగళగిరి నుంచి యర్రబాలెం మీదుగా పెనుమాక తన ఇంటికి వస్తూ మార్గంమధ్యలో పెనుమాకకు చెందిన పోచమ్మతల్లి అనే మహిళ లిఫ్ట్ అడగగా ఆమెను ఎక్కించుకుని వస్తోంది. ఇదే క్రమంలో పెనుమాక నుంచి యర్రబాలెం వైపు వెళుతున్న ఓ స్కూల్ బస్సు అతి వేగంగా వచ్చి ప్రత్యూష ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ప్రత్యూష, పోచమ్మతల్లి ఇద్దరూ రోడ్డుపై పడడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయని, వైద్య నిమిత్తం స్థానికులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లారని, గాయపడిన ఇద్దరూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఇదిలా ఉండగా తరచూ ఉండవల్లి, పెనుమాక, యర్రబాలెం రోడ్డులో స్కూల్ బస్సులు రోడ్డు ప్రమాదానికి గురి అవుతున్నాయి. అది కూడా రాత్రి సమయాల్లో 60 సంవత్సరాలు పైబడిన వారు ఈ బస్సులు నడుపుతున్నటు స్థానికులు తెలుపుతున్నారు. కళ్లు సరిగా కనబడక పోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు తనిఖీలు చేసి 60 సంవత్సరాలు పైబడిన వారిని గుర్తించి స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రత్యూష

### స్మార్ట్ మీటర్లతో ప్రజలపై రూ.23 వేల కోట్ల భారం



**కాజ/చినకాకాని(మంగళగిరి):** స్మార్ట్ మీటర్లతో రాష్ట్ర ప్రజలపై రూ.23 వేల కోట్ల భారం ప్రభుత్వం మోపుతుందని ప్రజా ఐక్య వేదిక నాయకులు అన్నారు. కాజ సచివాలయం వద్ద స్మార్ట్ మీటర్లు వద్దంటూ ఆందోళన నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందజేశారు. చినకాకానిలో స్మార్ట్ మీటర్ల వద్దంటూ నాయకులు ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మేము అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి ఏడాదిన్నర కాలంలోనే మూడు సార్లు పెంచారన్నారు. మంత్రి నారా లోకేష్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండని పిలుపునిచ్చి, అధికారంలోకి వచ్చాక అదానీ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు ముందుకు రావడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రజా ఐక్యవేదిక నాయకులు ఈమని అప్పారావు, వుద్దంటి దుర్గారావు, భీమిరెడ్డి కోటేశ్వరి, మారెళ్ళ అంజిరెడ్డి, గండికోట బాబూ వరప్రసాద్, శ్రీనివాసరావు, సింహాద్రి సుమ, శ్రీనివాసు పాల్గొన్నారు.

### స్మార్ట్ మీటర్లతో పేదలపై భారం

**తాడేపల్లిరూరల్:** స్మార్ట్ మీటర్ల పేరుతో పేదలపై మరింత భారం మోపడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయని సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు వ్యాఖ్యానించారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటలో మున్సిపల్ కార్మికుల మచ్చల పాయింట్ వద్ద సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి విచ్చేసిన సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే ప్రతి ఒక్కరు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంతోషం, నాగేశ్వరరావు, బాలయ్య, రాంబాబు, అనూష, సువార్త పాల్గొన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసుబొమ్మ సెంటర్, కేఎల్ రావు కాలనీల్లో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఇంటింటికి తిరిగి గురువారం సీపీఎం పట్టణ నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు జి.సుబ్బారెడ్డి, డి.విజయబాబు, మేరి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

# నులిపురుగుల నిర్మూలన దినోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ

**మంగళగిరి టౌన్:** మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయంలో ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంటీఎంసీ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి అధికారుల టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఇందిరానగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగుల నిర్మూలనకు ప్రభుత్వం ఈ నెల 12న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తుందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను 12వ తేదీన పాఠశాలలకు పంపించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. స్థానిక మార్కండేయ కాలనీ, పెదవడ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు వాసు నాయక్, సతీష్, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కె.సరిత, ఎంఈఓ ఉషారాణి, మంగళగిరి, తాడేపల్లి డిప్యూటీ తహసీల్దార్లు జి.అంకారావు, రిజ్వాన్ పాల్గొన్నారు.

**12న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ**

**దుగ్గిరాల:** 12న ప్రపంచ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు దుగ్గిరాల పీహెచ్‌సీ వైద్యాధికారి రెహమాన్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో వైద్యాధికారి, ఎంఈవోతో సమావేశం అయ్యారు. కార్యక్రమంపై చర్చించి, అనంతరం మీడియాతో మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల్లో 12న నులి పురుగుల నివారణ మందు పంపిణీ చేస్తామని, అప్పుడు ఎవరైనా హాజరు కానియెడల వారికి 20న ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు భవాని, హెల్త్ సూపర్‌వైజరు మహ్మద్ ఖాజా, ఎంఈవో కె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, వైద్యులు

# చేనేత బకాయిలు చెల్లించాలి

**మంగళగిరి:** ప్రభుత్వం నేతన్నలకు 10 సంవత్సారాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.127.87 కోట్లు వెంటనే చెల్లించాలన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మిక సంఘం, చేనేత పరిరక్షణ కమిటీ, మాస్టర్ వీవర్స్ అసోషియేషన్‌ల ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. 8 సంవత్సారాలుగా ఎన్నికలు లేక సహకార సంఘాలు నిర్వీర్యమవుతున్నాయన్నారు. చేనేత పరిశ్రమకు సమగ్ర ప్రణాళిక పవర్‌లూమ్‌తో కాకుండా చేనేత మగ్గాల్లోనే వస్త్ర తయారీకి ప్రోత్సాహించాలన్నారు. కార్యక్రమంలో మురుగుడు లక్ష్మీనారాయణ, నీలి నాగమల్లేశ్వరరావు, నందం బ్రహ్మేశ్వరరావు, బత్తూరి మోహనరావు, దొడ్డి ఈశ్వరరావు, బత్తుల గిరి తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ ఆధ్వర్యంలో చేనేత దినోత్సవం**

**మంగళగిరి:** మండలంలోని చినకాకాని ఎన్ఆర్ఐ వై జంక్షన్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. నేతన్న విగ్రహం చుట్టూ పూలమాలలతో అలంకరించి నేతన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. నాయకులు మాట్లాడుతూ నేతన్నలను ఆదుకునేందుకు వందలాది క్లస్టర్‌లను ఏర్పాటు చేసి నేతన్నలను ఆదుకుంటుందన్నారు. మర మగ్గాలకు 500 యూనిట్లు, నేత కార్మికులకు 200 యూనిట్లు ఉచితంగా అందజేస్తుందన్నారు. వీవర్స్ సెల్ కన్వీనర్ జగ్గారపు శ్రీనివాసరావు, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండా నవనీత్ కృష్ణారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తులిమిల్లి రామకృష్ణ, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు అందే శంకరరావవు తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఆర్ఐ సర్కిల్‌లో చేనేత దినోత్సవం

### అవ్వకు ఎంత కష్టం!



ఆఖరి దశలో హాయిగా బిడ్డలు, మనవళ్లతో కాలం వెళ్లదీయాల్సిన ఆ వృద్ధురాలు.. ఇలా చెట్లపొదల్లో అందరికీ కనిపించింది. ఈ తల్లిది ఏ ఊరో... ఆమె బిడ్డల పేర్లు ఏమిటో చెప్పలేని అపస్మారక స్థితి ఆమెది. మంగళగిరి పరిధిలోని చినకాకాని జెడ్పీ హైస్కూలు పక్కన పొదలలో ఈ వృద్ధురాలు ఉండటాన్ని స్థానికులు గమనించి, పోలీసులకు చేరవేశారు. రూరల్ ఎస్ఐ ఎస్.వెంకట్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధురాలి వివరాలు సేకరించే ప్రయత్నం చేశారు. కానీ ఆమె మాట్లాడలేని స్థితిలో ఉండటంతో చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాపత్రికి తరలించారు. ఈ వృద్ధురాలిని గుర్తుపట్టిన వారు తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. –మంగళగిరి

# కేఎల్‌యూలో జాతీయ చేనేత దినోత్సవం

**తాడేపల్లిరూరల్ :** తాడేపల్లి రూరల్ పరిధి వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్రాఫ్ట్ కౌన్సిల్ సెక్రటరీ రంజన, కేఎల్‌యూ కార్యదర్శి డాక్టర్ కోనేరు శివకాంచన లత, కలంకారి కళాకారుడు నాగేశ్వరరావులు విచ్చేశారు. ఈ సందర్భంగా శివకాంచన లత మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవాన్ని క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ, కేఎల్‌యూ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించామని, చేనేత అనేది దేశ జీవనాడి అని తెలిపారు. మంగళగిరిలో తయారయ్యే చేనేత వస్త్రాలలో వందశాతం కాటన్ ఉంటుందని అన్నారు. చేనేత కళాకారులకు నానాటికీ ఆదరణ తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చేనేత, హస్త కళల పట్ల అవగాహన పెంచుకోవాలని కోరారు. క్రాఫ్ట్ కౌన్సిల్ సెక్రటరీ రంజన మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, కమలోపాధ్యాయ చటర్జీ హస్త కళలను కాపాడేందుకు సంక్షేమ వ్యవస్థను ప్రారంభించారని అన్నారు. ఆమె అడుగుజాడల్లో నడుస్తూ జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. అనంతరం విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు నిర్వహించిన క్విజ్, ఆర్ట్, హస్తనేయ వాక్, రీల్ పోటీలు ఆకట్టుకున్నాయి. కలంకారి కళాకారుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఐటీ ఉద్యోగాన్ని వదిలి తండ్రి, తాతల వారసత్వంగా వచ్చిన కళను కొనసాగించేందుకు తీసుకున్న నిర్ణయం విద్యార్థులను ప్రభావితం చేసిందని అన్నారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సాక్ డైరెక్టర్ పి.సాయి విజయ్, క్రాఫ్ట్ కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ శివకాంచన లత